


# గాంధర్వం

అంగర సూర్యారావు

ఆమె పెదవులపై చిరునవ్వు చిందులాడుతోంది. ఆమె కళ్లు తనవైపు తిరిగి వున్నాయి. ఒయ్యారంగా చూస్తూ తనని ఆహ్వానిస్తున్నట్లున్నాయి, ఆ చూపులు. మూర్తీభవించిన సౌందర్యదేవతలా వుందామె. యిక భరించలేకపోయాడు రంగారావు. తీరని ఆవేదనతో ఆ ఫొటోను తిరిగి టేబిలుమీద పెట్టాడు. తిరిగి తిరిగి చూసుకున్నాడు, తన అభిమానతార ముఖాన్ని.

మిస్. భామిని నటించిన చిత్రాలన్నీ విడవకుండా చూశాడు రంగారావు. తారామండలంలో ఆమెకంటే ఉజ్వలంగా ప్రకాశించే తార మరెవరూ లేరని అతని నమ్మకం. ఒకసారి ఒక చిత్రానికి జరిగిన అర్ధశత దినోత్సవానికి ఆమె హాజరైనప్పుడు ఆమెను స్వయంగా చూశాడు కూడా. అలాంటి సౌందర్యదేవత వాస్తవిక ప్రపంచంలో మరొకామె కనిపిస్తుందేమోనని చాలా ప్రయత్నించి చూశాడు. ఫలితం లేకపోయింది.

తారామండలంలో వుండే నక్షత్రాలు భూమిమీద వుండే మానవులమీద శ్రద్ధ తీసుకొని వారి జీవితాలను, ప్రవర్తనలను సరిదిద్దుతూ వుంటాయని పెద్దలు నిశ్చయించారు. ఆ సిద్ధాంతంమీద తారాబలం, చంద్రబలం. మీన మేషాల లెఖ్ఖలు వగైరా వగైరా సృష్టించబడినై. యిది ఎంతవరకూ నిజమో తేల్చి చెప్పడం కష్టం—తారామండలంలో వుండే (తెర) తారల ప్రభావం యువతీ యువకులమీద జోరుగా పడుతున్న దనడం మాత్రం నిస్సందేహం. అందుకు ఉదాహరణగాతిన్నగా రంగారావు వుండనే వున్నాడు.

కథానిక

ఒకనాటి సంధ్యాసమయం. ఉత్సాహంతో ముందుకు నడుస్తున్నాడు రంగారావు. దారికిరువైపులా రకరకాల బోర్డులు ''మమ్మల్ని చూడవేం?'' అని వురిమి చూస్తున్నట్లున్నాయి. ఒక బోర్డుమీద రూపాయను అమాంతంగా కత్తిరించేస్తున్న బొమ్మ ఒకటి కనిపించింది. ఆ బొమ్మకు దిగువను తాటికాయలంత అక్షరాలతో ''తగ్గింపు ధరలు'' అని రాసి వుంది. ఆ షాపులోకి వెళ్ళాడు రంగారావు, రకరకాల జోళ్లు షో కేసులో కనిపిస్తున్నాయి. వివరాలు కనుక్కునేసరికి అసలు ఖరీదులో అర్ధణా మాత్రమే తగ్గించబడిందని తెలిసింది. 'మోసం, మోసం' అనుకున్నాడు రంగారావు. అనుకుంటూనే యివతల అడుగు పెట్టాడు. అడుగు వేస్తూనే ఆగిపోయాడు. అతని గుండె వేగంగా కొట్టుకొంది. ఆమె వస్తోంది. అనేక యువక హృదయాలను కలవరపరుస్తున్న ప్రఖ్యాత నటీమణి మిస్. భామిని! ఆ కళ్లు, ఆ పెదవులు, ఆ ముఖం అతనికి చిరపరిచితాలు. ఈ తెరదేవత ఒంటరిగా ఎందుకు వస్తోంది! ఆమె సమీపించింది. విస్మయచకితుడై చూశాడు. అమె మిస్. భామినికాదు. అదే పోలికలువున్న మరో సుందరాంగి. ఆ సుందరి అతనిని చూడనైనా చూడకుండా ముందుకు సాగిపోయింది. మెడ బెణికిన

దానిలా ప్రక్కలకైనా చూడకుండా ఎందుకు పోతోంది చెప్మా ఈ చిన్నది! అని ఆశ్చర్య పోయాడు రంగారావు. నిశ్చేష్టుడై ఆమె పోతున్న దిక్కు చూస్తూ నిలబడి పోయాడు. ఒక బరువైన చెయ్యివచ్చి భుజంమీద పడ డంతో రంగారావు బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు. వెనక్కితిరిగి చూశాడు. బాగా బలిసి వున్న ముఖంతో, చిన్న కోరమీసంతో సస్పె న్సురావు కనిపించాడు. అతనిని చూడగానే రంగారావుకు ప్రాణం లేచి వచ్చినట్లయింది.

''చూడు! చూడు! అలా పోతోంది. ఆ అమ్మాయి నీకు తెలుసా?'' అన్నాడు రంగా రావు ఆత్రుతతో.

''తెలియదు. వెంటనే తెలియకుండా వుండడం చాలా మంచిది. ఏ విషయమైనా ఆలస్యంగా పరిశోధనానంతరం తెలియడమే మంచిది. లేకపోతే అందులో సస్పెన్సు ఏమి ఏడిచింది?'' అన్నాడు సస్పెన్సురావు.

రంగారావుకు రావలసినంత కోపంవచ్చింది. తీక్షణంగా చూశాడు. సస్పెన్సురావు మాత్రం లాంతరు స్తంభంలా కదలకుండా అలాగే నిల బడి వున్నాడు.

సస్పెన్సురావు అసలుపేరు జోగిరాజు. యోగి, జోగి, బైరాగి మొదలైన దరిద్రాన్ని సూచించే పేర్లనుచూస్తే అతనికి మహచెడ్డ కోపం. అతనికి పేరుపెట్టడానికి అతని మేన మామ నూకరాజు కారకుడు. ఆ మేనమామ యింకా బ్రతికివుంటే అతనిని ఆరుగుళ్ళ ఆటో మేటిక్ రివాల్వరుతో కాల్చిపారేసి వుండేవాడు సస్పెన్సురావు. అసలు అతని జీవితచరిత్రలో అడుగడుగునా సస్పెన్సు కనిపిస్తూనే వుంటుంది.

తెలియని విషయాలు వినయంతో యితరు లనుచూసి నేర్చుకోమన్నారు పెద్దలు. తు. చ. తప్పకుండా సస్పెన్సు రావు అదే పనిచేశాడు. పరీక్షా సమయంలో అతనికి ఓ లెక్క బుర్ర బద్దలు కొట్టుకున్నా తెలియలేదు. వెంటనే తల పైకెత్తాడు. తనకు ముందు సీటులో కూర్చుని వున్న విద్యార్థిని చూశాడు. భక్తిశ్రద్ధలతో మెడ ఓరగాపెట్టి ఆ విద్యార్థి ఆన్సరు పేపరులోని లెక్క కాస్తా తన ఆన్సర్సు పేపరులోకి దిగుమతి చేశాడు. ఇంతకంటే అత నే విధమైన తప్పూ చెయ్యలేదు. కాని పరీక్షాధికారులు మాత్రము అతని పరీక్షా ఫలితాన్ని యీనాటికీ తెలియ జెయ్యలేదు. ఇది అతని విద్యార్థి దశ.

పరిస్థితులు అనుకూలంగా లేక చివరకు ఒక ఆఫీసులో గుమాస్తాగా చేరాడు, సస్పెన్సు రావు. అతని తార్కిక శక్తిముందు ఆ ఆఫీసు లోనివాళ్లెవరూ నిలవలేకపోయారు. ఒకసారి హెడ్‌గుమాస్తాకు సస్పెన్సురావుకు మాటా మాటా వచ్చి చేయీచెయ్యీ కలిసేవరకూ పోయింది వ్యవహారం. చివరకు 'ఇన్ సబార్డి నేషన్' నేరంక్రింద సస్పెన్సురావును ఉద్యోగం లోంచి సస్పెండు చేశారు. ఈనాటివరకూ వాళ్ళు తిరిగి అతనిని ఉద్యోగంలోకి పిలవ లేదు.

ప్రస్తుతం అతని వృత్తి నిరుద్యోగం. హాబీ భావ కవిత్వం. నిరుద్యోగులకు భావ కవిత్వం గంగావాహినిలా దానంతట అదే పొంగి వస్తుంది. కాని ఏం ప్రయోజనం? ఈ పవిత్ర భారతదేశంలో స్వదేశీ కవిత్వానికి రవంత ఆదరణ కూడా లేదు. అందుచేత సస్పెన్సు రావు—విధిలేక విదేశీ సాహిత్యాన్ని ఆశ్రయించ వలసి వచ్చింది. రౌద్ర భయానక బీభత్స రసాలతో కూడిన ~పరాధ పరిశోధక నవలలు రాయడాని కుపక్రమించాడు. దానితో అతని తార మారిపోయింది.

''ఆమెను యిదివరకు నువ్వెక్కడైనా చూశావా?'' ప్రశ్నించాడు రంగారావు.

''ఇదివరకూ చూడలేదు. ఇప్పుడూ చూడ లేదు'' అన్నాడు సస్పెన్సురావు.

''అయితే యిక నీ దారిని నువ్వు దయ చెయ్. నా శ్రమేదో నేను పడతాను.'' కోపంతో ముందుకు నడిచాడు రంగారావు.

సస్పెన్సురావు అతని చెయ్యి పట్టుకొని ''తొందరపడకు. పరిశోధన ప్రారంభించానంటే క్షణంలో వివరాలన్నీ తెలిసిపోతాయి. రేపు ఉదయం పొగ్గా తయారై, నా లాడ్జికి రా'' అన్నాడు.

మర్నాటి ఉదయం ఎనిమిది గంటలయ్యే సరికి రంగారావు సస్పెన్సురావు లాడ్జిలో హాజరయ్యాడు. ఆ సమయంలో సస్పెన్సురావు న్యూస్‌పేపరు చదువుతూ హత్యలకు, ఆత్మహత్యలకు, దోపిడీలకు, దొంగతనాలకు సంబంధించిన వార్తలను ఎర్ర పెన్సిలుతో గుర్తుపెట్టుకుంటున్నాడు.

''లే! అలా వూళ్లోకి పోదాం'' అన్నాడు రంగారావు.

ఆ మాటలు సస్పెన్సురావుకు వినిపించలేదు. పేపరు చదువుతూ ''రైలుబద్దీలమీద శవం! హత్యయా - ఆత్మహత్యయా? వివరాల కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు'' చదవడం ముగించి ''అద్భుతమైన వార్త! చక్కని ప్లాట్ దొరికింది'' అన్నాడు.

''ఒరేయ్ సస్పెన్సురావూ! సీరియస్‌గా చెబుతున్నాను. యిక ఆలస్యంచేస్తే నేను వూరుకోను'' అన్నాడు రంగారావు కోపంతో.

యిద్దరూ కలిసి ఉత్సాహంతో ఉత్తర దిశ వైపు నడవసాగారు. నాలుగు అడుగులు వేశారో లేదో, యింతలో వెనుకనుంచి ఓ వ్యక్తివచ్చి ''ఏమండోయ్, రావుగారూ! నమస్కారం'' అన్నాడు.

సస్పెన్సురావు వెనుకకు తిరిగి సంభ్రమాశ్చర్యాలతో ''ఓహో! మీరా! ఏమిటి విశేషం?'' అన్నాడు.

''ఏం విశేషమండి? డిటెక్టివ్‌నవల రాసిస్తానని అడ్వాన్సు వందరూపాయలు పట్టుకుపోయారు. యీనాటివరకూ అతీగతీ లేదు'' అన్నాడా వ్యక్తి.

''యిప్పుడే అద్భుతమైన ప్లాటు దొరికింది. రేపు సాయంత్రానికి మీకు నవల తయారుచేసి యిస్తాను,'' అన్నాడు సస్పెన్సురావు.

ఆ వ్యక్తి వచ్చిన దారినే వెళ్ళిపోయాడు.

రంగారావుకు యీ వ్యవహారం అసలు నచ్చలేదు. ఆ అజ్ఞాత సుందరి ఎవరు? ఆమె నివాసమెక్కడ? యీ వివరాలు అతనికి వెంటనేకావాలి. యిద్దరూ ఉత్తరదిశ అంతా గాలించారు. ప్రయోజనం లేకపోయింది. తిరిగి పశ్చిమదిశ వైపు ప్రయాణం సాగించారు. ఎంత వెతికినా ఆమె కనిపించలేదు.

చివరకు యిద్దరూ లాడ్జి చేరుకున్నారు, నిస్పృహతో.

''యీ విధంగా మన ప్రయత్నం విఫలం కావడం ఏమీ బాగాలేదు,'' అన్నాడు సస్పెన్సురావు.

''ఏదైనా మరో చక్కని ఉపాయం ఆలోచించు,'' అన్నాడు రంగారావు.

సస్పెన్సురావు దీర్ఘాలోచనలో పడ్డాడు.

అమాంతంగా ''దొరికింది! దొరికింది!'' అన్నాడు ఉత్సాహంతో.

''ఏమిటది?''

''నీకు మొన్న ఆమె ఏ సమయంలో కనిపించింది?''

''సాయంత్రం 5 గంటలకు.''

''ఎక్కడ?''

''నాలుగురోడ్లు కలిసేచోట!''

''సరిగా అదే సమయంలో యివేళ అక్కడ కొద్దాం'' అన్నాడు సస్పెన్సురావు.

ఈ సలహా రంగారావుకు నచ్చింది.

ఆ రోజు సాయంత్రం నాలుగు రోడ్ల కూడలి దగ్గర యిద్దరూ హాజరయ్యారు. గంటలు గడిచిపోతున్నాయి. వాళ్ళు అలాగే నిలబడి వున్నారు. యింతటి శ్రమకోర్చి నిలబడడంలో గల ఆనందం యేమిటో సస్పెన్సురావుకు అర్థంకాలేదు. చిరాకుతో. ''లాభంలేదు. యిక పోదాం నడు!'' అన్నాడు.

''తొందరపడకు! మరో ఐదు నిముషాలు ఆగు'' అన్నాడు రంగారావు.

''ఐదు నిమిషాలు కాదుకదా! అరనిముషం కూడా వుండలేను.'' అన్నాడు సస్పెన్సురావు.

''ఉష్! అదుగో! అదుగో! అలా చూడు!'' అన్నాడు రంగారావు వూపిరి బిగబట్టి.

సస్పెన్సురావు తల పైకెత్తి చూశాడు. తెల్లగావుందామె. ముఖం గుండ్రంగా వుంది. ఎత్తు 5 అడుగుల 3 అంగుళాలు వుండవచ్చు. జాకెట్టు, చీర ఖరీదైనవి కావు. మెడలో ఆభరణాలు లేవు. కనక యీమె ధనవంతుల బిడ్డ మాత్రంకాదు. కేవలం పరిశోధనా దృష్టికల

వాడు గనక, ఒక చూపుతోనే యీ విషయాలన్నీ గ్రహించేశాడు సస్పెన్సురావు. ఆమె యిటు చూడనైనా చూడకుండా తన దారిని తాను వెళ్ళిపోతోంది.

"యిక నువ్వు నిశ్చింతంగా యింటికి వెళ్ళిపో! రేపు తెల్లవారేసరికి నీకు వివరాలన్నీ తెలియజేస్తాను." అని తొందరగా ఆమె వెళ్ళిన దారినే నిష్క్రమించాడు సస్పెన్సురావు.

రంగారావు ఆశ్చర్యంతో అలా నిలబడి పోయాడు. కొన్ని క్షణాలకు తేరుకొని యింటి వైపు నడిచాడు.

సినిమాలోని హీరోలా రాత్రంతా నిద్రపట్టక బాధపడ్డాడు. తెల్లవారేసరికి సస్పెన్సురావు సిద్ధమయ్యాడు.

"తెలిసిపోయాయి. వివరాలన్నీ తెలిసి పోయాయి" అన్నాడు ఉత్సాహంతో సస్పెన్సురావు.

"ఆమె ఎవరు?"

"ఆమె పేరు మణి."

"పూర్తి పేరు?"

"నాగమణి అయినా కావచ్చు. చూడామణి అయినా కావచ్చు. చింతామణి మాత్రం కాదని నిస్సందేహంగా చెప్పగలను."

"వాళ్ళ నాన్న పేరు?"

"అదే తెలిసింది కాదు. తెలియకపోయినా ఫర్వాలేదు. యిల్లుచూసి వచ్చాను."

"అయితే యిహనేం! ఒకసారి ఆమె యింటికి వెళ్ళేందుకు ఉపాయం ఆలోచించు." అన్నాడు సంతోషంతో రంగారావు.

ఈసారి దీర్ఘాలోచనలో పడ్డాడు సస్పెన్సురావు. అలా వరసగా నాలుగు రోజులు గాఢాలోచనలో మునిగిపోయాడతడు.

ఈ నాలుగు రోజుల్లోను రంగారావు పడ్డ శ్రమ వర్ణనాతీతం. ఆమెకు దారిలో చాలాసార్లు ఎదురయ్యాడు. ఒకనాడు ఆమె ఏమనుకుందో ఏమో ఒకసారి అతనికేసి చురచురా చూసి మలుపుతిరిగి మాయమయ్యింది.

నాలుగు రోజులు గడిచిన తరవాత ఉత్సాహంతో "దొరికిపోయింది. దొరికిపోయింది." అన్నాడు సస్పెన్సురావు.

"ఏమిటి?"

"అద్భుతమైన ఉపాయం. ఆమె యింట్లో అడుగు పెట్టడానికి మనకు చక్కని ఉపాయం దొరికింది."

"అదేమిటో వెంటనే చెప్పి తగులడు." అన్నాడు చిరాకుతో రంగారావు.

"మారు మాటాడకుండా నా వెనకనే రా!" అన్నాడు సస్పెన్సురావు, డిటెక్టివ్ పోజులో.

సస్పెన్సురావు భుజానికి ఒక పొడుగుపాటి సంచి తగిలించుకున్నాడు. సంచిలో చిన్నచిన్న పుస్తకాలు, కొన్ని తెల్లకాగితాలు వేసుకున్నాడు. జేబులో నోట్ బుక్, పెన్సిలు పెట్టాడు. సిగరెట్టు ఒక్కసారి గట్టిగా పీల్చి తూర్పుదిక్కువైపు నడవసాగాడు. రంగారావుకు యిదేమీ అర్థం కాలేదు. వీడికి మతి పోలేదుకదా కొంపతీసి! అనుకున్నాడు. విధిలేక సస్పెన్సురావును అనుసరించాడు.

ఇద్దరూ మహత్తర ఘనకార్యాలను సాధించే రాజకుమారులలా ఠీవిగా ముందుకు నడవసాగారు.

• • •

ఆఫీసులో రోజంతా శ్రమపడి పనిచేసి రెండు కాగితాల కట్టలు చేత్తోపట్టుకొని అలిసిపోయి యింట్లో అడుగుపెట్టాడు కుచేలరావు. అక్కడేవున్న కుర్చీలో కూలబడి "మణీ! కాఫీ తే అమ్మా!" అన్నాడు.

కుచేలరావు నిజంగా కుచేలుడు. అతనికి ఐదుగురు ఆడపిల్లలు, నలుగురు మగపిల్లలు వున్నారు ఆడపిల్లలకు కట్నాలిచ్చి పెళ్ళి చెయ్యలేనని అతనేనాడోనిశ్చయించుకున్నాడు. అందుచేత ఆడపిల్లల్ని కూడా మగపిల్లలతో పాటు చదివిస్తున్నాడు. అతని మనసులో రహస్యంగా ఒక కోరిక దాగివుంది. ఆ కోరికను అతను ఏ పరిస్థితులలోను వెల్లడించడు. పెద్ద కూతురు మణి కాఫీ తీసుకువచ్చింది. పాపం, యీ పిల్లలకు తను ముద్దూ ముచ్చటా తీర్చలేకపోతున్నాడు. కట్టుకునేందుకు శుభ్రమైన చీరలైనా కొనలేకపోతున్నాడు.

కాఫీ తాగి కొంచెం స్థిమితపడి "ఆదివారం పేపరు ఒకసారి తీసుకురా అమ్మా!" అన్నాడు.

ఆమె పేపరుయిచ్చి వెళ్ళిపోయింది.

కుచేలరావు పేపరు తెరిచి నక్షత్ర ఫలితాలు చూడసాగాడు.

"చాలాకాలంనుంచి నెరవేరకుండా వున్న పనులు యీ వారంలో నెరవేరతాయి. కోర్టు వ్యవహారాలలో కొంత ఓర్పును ప్రదర్శించాలి. వారారంభంలో కొన్ని ముఖ్యమైన శుభ సూచనలు కనిపిస్తాయి. వారాంతంలో అల్లులతో పేచీలు, బంధు సందర్శనం...."

చేతిలోని పేపరు అమాంతంగా జారి పోయింది. ఆఫీసులలో పనిచేసేవాళ్ళకు అల్లులతో పేచీలు ఎలాగూ తప్పవు. ఇంతకూ యీ అల్పుడు అన్న పదానికి అర్థమేమిటి? బుద్ధిలో అల్పుడా? ధనంలో అల్పుడా? పోనీ దాని మాటకేం? వారాంతంలో బంధు దర్శనమట! ఏం గతి? నెలచివరిరోజులలో జేబులుఖాళీగానూ, హృదయం బరువుగానూ వున్న సమయంలో చుట్టాలువస్తే యింకేమైనా వుందీ? కుచేలరావు భయాన్నుంచి యింకా తేరుకోకముందే అతని గుమ్మంలో యిద్దరు యువకులు ప్రత్యక్షమయ్యారు. అందులో ఒక యువకుడు చిన్న కోరమీసాలతో భగత్సింగులా కనిపిస్తున్నాడు. మరో యువకుడు సినిమా యాక్టరులా వున్నాడు. కొంపతీసి యీ యిద్దరూ తనకు ఏ దూరపుబంధువులో కారు కదా?

అతను ఆలోచనలనుంచి తేరుకోకముందే ఆ యువకు లిద్దరూ గుమ్మంలో అడుగుపెట్టి అతనికి నమస్కారం చేశారు. ఈసారి కుచేలరావు మరింత ఆశ్చర్యపోయాడు. తన ఆఫీసులోని ముసలి బంట్రోతు అప్పన్న మినహా తనకు నమస్కారం చేసేవాళ్ళు యీ వూళ్ళో ఎవరూలేరు. వీళ్ళకు యిప్పుడు వచ్చిన ఆపద ఏమిటి చెప్మా, అనుకున్నాడు కుచేలరావు.

"ఎవరు నాయనా మీరు? ఎందుకు యిలా వచ్చారు?" అన్నాడు కుచేలరావు.

'చచ్చాంరా భగవంతుడా! యీ సస్పెన్సురావు అన్నీ యిలాంటి పనులే చేస్తాడు. యిప్పుడేం జవాబు చెప్పాలి?' తనలో తాను తొందరపడుతున్నాడు రంగారావు.

సస్పెన్సురావు మాత్రం తొణుకూ బెణుకూ లేకుండా రాతి విగ్రహంలా అలా నిలబడే వున్నాడు.

యింతలో మణి అక్కడికి వచ్చింది.

"ఎవరునాన్నా వీరు? కూర్చోమనవేం?" అంది కమ్మని కంఠంతో.

"కూర్చోండి నాయనా! మరిచిపోయాను. ఏదో పెద్దవాణ్ణి. నాకంటే మా అమ్మాయికి అతిథి సత్కారం బాగాతెలుసు," అన్నాడు కుచేలరావు.

"ఓ సుందరీ! నీ దర్శనమే పెద్ద అతిథి సత్కారం.అంతకంటే వేరేసత్కారం ఎందుకు?" అని తనలో అనుకున్నాడు రంగారావు.

సస్పెన్సురావు, రంగారావు చెరో పాతకుర్చీలోను కూర్చున్నారు. మణి రంగారావుకేసి చిరునవ్వుతో చూసింది. అతనికి ముచ్చెమటలు పోశాయి. హరి భగవాన్! తన హృదయాన్ని కలవరపరచే నవ్వు అదే!

"బాబూ! మీరు వచ్చిన పనేమిటో చెప్పారుకాదు." అన్నాడు కుచేలరావు.

"అబ్బే! ఏమీలేదండి! చాలా చిన్న విషయం!" అన్నాడు సస్పెన్సురావు.

"వీ డిప్పుడు కొంప ముంచడుకదా!" భయపడ్డాడు రంగారావు.

సస్పెన్సురావు భుజాన్నివున్న సంచిలోంచి చిన్న పుస్తకం ఒకటి పైకితీసి "బీద విద్యార్థుల నిధికి రేపు నాటకం ప్రదర్శిస్తున్నాం. మీరు ఒక టిక్కెట్ కొనాలి." అన్నాడు చిరునవ్వుతో.

దానితో రంగారావు ముఖంలో భయ చిహ్నాలు తొలగిపోయాయి.

"బీదవాణ్ణి, నెల చివరిరోజులలో నేను టిక్కెట్టు ఎలా కొనగలను నాయనా?" అన్నాడు వినయంతో కుచేలరావు.

"ఫరవాలేదు. ఏదీ ఒక టిక్కట్ యిలా యివ్వండి." అంది మణి.

టిక్కెట్ తీసుకొని లోనికివెళ్లి ఒక రూపాయి నోటు తీసుకువచ్చి సస్పెన్సురావుకు ఇచ్చింది. యిస్తూ మరోసారి రంగారావుకేసి ఓరగా చూచింది. దానితో రంగారావు హృదయంలో మరోసారి కల్లోలం ప్రారంభమయ్యింది.

సస్పెన్సురావు, రంగారావు వచ్చిన దారినే విజయగర్వంతో నిష్క్రమించారు. కుచేల రావుకు యీ వ్యవహారం చికాకు కలిగించింది. మణిమీద చాలా కోపంవచ్చింది. ఈ పిల్ల లేని గొప్పలకుపోయి డబ్బు తగలేస్తూ వుంటుంది. తన మాటలకు విలువ యివ్వదు, నెలాఖరు రోజులలో ఒక రూపాయకు ఎంత విలువ వుంటుందో యీమెకేం తెలుసు? నెలలో పదవ తేదీనుంచి డబ్బుకు యిబ్బంది తప్పదు. పూర్వులు సంపాదించిన ఆస్తి కాస్తా పిల్లల చదువులకే తగలేశాడు. తనకు చివరకు మిగిలింది నిత్యదరిద్రం.

పిల్లలకు రెండవ 'టరము'కు జీతాలు కట్టాలి. అంత డబ్బు యివ్వడు ఎక్కడినుంచి వస్తుంది? యిప్పటికే చుట్టూ యమకింకరులలా బాకీలవాళ్లు కనిపిస్తూ వున్నారు. సంసారం అనే యీ సుడిగుండాన్ని దాటడం ఎలా భగవాన్?

తను వుంటున్న కొంప మంచిదికాదని, యీ యింటిలో వున్నంతకాలం దరిద్రం తప్పదని ఆమధ్య ఒక సిద్ధాంతి చెప్పాడు. ఈ విషయం నూటికి నూరుపాళ్లు నిజమని తోచింది కుచేలరావుకు. ఈయిల్లు అమ్మి పారేస్తే తన దరిద్రం శాశ్వతంగా తీరిపోతుందని నమ్మాడు. కూతురుకు తన ఉద్దేశం తెలియజేశాడు.

"అన్నీ ఒట్టి పిచ్చినమ్మకాలు నాన్నా!" ఆమె తేలికగా కొట్టి పారేసింది.

ఈ కాలపు పిల్లలకు గ్రహబలంమీద అసలు నమ్మకంలేదు. వాళ్ళతో యిటువంటి విషయాలు చర్చించడం మంచిదికాదు.

తను ఎలాగైనా యీ యిల్లు అమ్మితీరాలి, లేకపోతే యీ కష్ట సముద్రంలోంచి గట్టెక్క లేడు. దృఢ నిశ్చయానికి వచ్చాడు కుచేల రావు.

అతని బాల్య స్నేహితుడు బంగారయ్య ఆకస్మికంగా గుర్తుకువచ్చాడు. ఊళ్ళో వున్న కుబేర పుత్రులలో బంగారయ్య ఒకడు. అతను తన యిల్లు కొంటే నిముషాలమీద రొఖ్ఖం చేతికి వస్తుంది. బంగారయ్యను కుచేలరావు కలుసుకొని చాలా కాలమయ్యింది. అతని వ్యవహారం ప్రస్తుతం ఎలావుందో కుచేలరావుకు సరిగా తెలియదు.

మర్నాటి ఉదయం బంగారయ్య యింటికి బయలుదేరాడు కుచేలరావు. గుమ్మంలో అడుగు పెట్టేసరికి ఒక యువకుడు ఎదురు వచ్చి కుచేలరావుకు నమస్కారం చేశాడు.

"నీకు బంగారయ్యగారేమౌతారునాయనా?"

"మా నాన్నగారేనండీ!" అన్నాడు రంగా రావు వినయంతో.

బంగారయ్య కొడుకుకు యింత వినయ విధేయతలు వుండడం విశేషమే అనుకున్నాడు కుచేలరావు.

"మీ నాన్నగారిని ఒకసారి పిలుస్తావు నాయనా?"

"ఇలా కూర్చోండి. ఇప్పుడే తీసుకు వస్తాను." లోనికి తొందరగా వెళ్ళిపోయాడు రంగారావు.

చుట్టూ పరిశీలించి చూశాడు కుచేలరావు. ఈ యింటిలో సిరిసంపదలు తాండవిస్తున్నై. మొన్న మొన్నటివరకూ బంగారయ్య చెప్పుకో తగ్గ ధనవంతుడు కాదు. రెండవ ప్రపంచ యుద్ధం తరవాత అతని తార మారిపోయింది. ద్వితీయ ప్రపంచ సంగ్రామం మానవుల జీవితాలను గారడీవాడిలా ఆకస్మికంగా మార్చి విడిచిపెట్టింది. ఒక మోస్తరు ధనవంతులు కుబేరులయ్యారు. పెద్దపెద్ద వ్యాపారుల ఆస్తులు ద్విగుణీకృతమయ్యాయి—మధ్యతరగతి ప్రజలు దరిద్రులయ్యారు. దరిద్రులు గర్భదరిద్రులయ్యారు. యిదంతా కుచేలరావు కళ్లముందే జరిగిపోయింది.

ఆ రోజులలోనే కుచేలరావు యిల్లు ఒక వైపు కూలిపోగా .బంగారయ్య యిల్లు నాలుగు అంతస్తుల మేడగా మారిపోయింది.

"ఏమోయ్ కుచేలరావు! యిలావచ్చావు?"

కుచేలరావు పక్కకుచూశాడు. బంగారయ్య తన వైపు వస్తున్నాడు. లావుగా, పొడుపుగా వున్నాడు. సిల్కు లాల్చీ వేసుకున్నాడు. ముఖం గుండ్రంగా, ప్రశాంతంగావుంది. సమవయస్కుడైనప్పటికీ తన కంటే చాలా చిన్నవాడిలా కనిపిస్తున్నాడు.

"ఒకవిషయం మాట్లాడదామనివచ్చాను." అన్నాడు సంశయిస్తూ కుచేలరావు.

"నా-దగ్గర సంశయమెందుకు? చెప్పు!" అన్నాడు బంగారయ్య కుర్చీలో కూర్చుంటూ.

"ఏమీలేదు. 'డబ్బుకు చాలా యిబ్బందిగా వుంది. యిల్లు అమ్మదామనుకుంటున్నాను." అన్నాడు తనలోతాను బాధపడుతూ.

"పిల్లలు గలవాడవు. వున్న యిల్లూ అమ్ముకుంటే ఎలా?-పోనీ యింటిమీద కొంత డబ్బు అప్పు యిస్తాను. తీసుకువెళ్లు."అన్నాడు బంగారయ్య.

బంగారయ్య ఉదార స్వభావానికి చాలా సంతోషించాడు కుచేలరావు.

"లాభంలేదు. ఆ యింటిమీద యిప్పటికే చాలా అప్పులు వున్నాయి. యిల్లు అమ్మి అప్పులన్నీ తీర్చేవరకూ ఒక దరికి చేరుకోలేను." అన్నాడు కుచేలరావు.

చివరకు బేరం కుదిరింది. ఆరువేల రూపాయలకు కుచేలరావు యిల్లు బంగారయ్య కొనేశాడు.

బంగారయ్య చేతిలో పడగానే కుచేలరావు యింటికి ఎక్కడలేని కళా వచ్చిపడింది. ఆ పాత కొంపను బాగుచేయించి దానిమీద మరో అంతస్తు వేయించాడు బంగారయ్య. మేడ ముందు చిన్న గార్డెన్ వేయించాడు. విద్యుద్దీపాలతో ఆ మేడ దేవేంద్ర భవనంలా మెరిసిపోతోంది. దానిని లాడ్జింగుహోమ్‌గామార్చాడు. ఒక గదికి రోజుకు ఐదురూపాయలు అద్దె. నెలకు అంచనావేసిన దానికంటే ఎక్కువ ఆదాయం వస్తోంది. రంగారావు వ్యవహారం మాత్రం తల్లక్రిందులయ్యింది. తన ఆదర్శ ప్రేయసి వుండేయిల్లు తాజమహలులా తయారై చివరకు తనకే బందిఖానాగా మారిపోయింది. రంగారావు రాత్రింబవళ్లు లాడ్జింగు హోమ్‌లోనే వుంటూ డబ్బు వసూలుచేస్తూ-ఎకౌంట్ చూస్తూ వుండాలి. అతనికి కాళ్ళు కట్టినట్లయ్యింది. మునుపటిలా స్వేచ్ఛగా తిరగడానికి వీల్లేదు.

కుచేలరావు ఒకమారుమూల వీధిలో చిన్న యిల్లు అద్దెకు తీసుకున్నాడు. తాత్కాలికంగా అతని దరిద్రం తీరింది. యిల్లు పోవడంతోనే తన దరిద్రం అంతా పోయినట్లు సంతృప్తి పడ్డాడు కుచేలరావు. కాని యిల్లు అమ్మినప్పటి నుంచీ అతని కూతురు మణి ప్రవర్తన విచిత్రంగా మారిపోయింది. చీటికీ మాటికీ యింట్లో పోట్లాడుతోంది.

నైతికంగా కూడా ఆమె దారి తప్పినట్లు కుచేలరావుకు అనుమానం కలిగింది. ఒకసారి ఆమె ఒక యువకుణ్ణి యింటికి తీసుకువచ్చింది. ఆ కుర్రవాడు ధనవంతుడట. పొరుగూరినుంచి వచ్చి యిక్కడ చదువుకుంటున్నాడట. తల్లి మినహా యిక ఎవరూ దగ్గరబంధువులు అతనికి లేరట. ఈ విషయాలన్నీ ఆ యువకుడిని ప్రశ్నించి తెలుసుకున్నాడు కుచేలరావు.

ఆ యువకుడు వెళ్లిపోయిన తరవాత కూతురును మందలించాడు కుచేలరావు.

"నీకు మగపిల్లలతో స్నేహం ఏమిటమ్మా?"

ఈ ప్రశ్నకు మణికి చాలాకోపం వచ్చింది. "నా మంచి చెడ్డలు నాకు తెలుసు, మీరు నా స్వవిషయాలలో జోక్యం కలిగించుకోవద్దు" అని ఖచ్చితంగా చెప్పింది.

తన అంతరాంతరాలలోని కోరిక ఒకటి నెరవేరుతున్నట్లు తనలో తాను ఆనందించాడు కుచేలరావు. ఎలాఅయినా యిల్లు అమ్మడంతోనే తన తార మారిపోయింది. ఒకసారి ఆకాశంకేసి చూశాడు కుచేలరావు. నిశ్చలంగా కాంతులు వెదజల్లుతున్నాయి తారలు.

లాడ్జింగ్ హోమ్ ఖ్యాతి రోజురోజుకు పెరిగిపోతోంది. ఆధునిక పరికరాలతో, సర్వ సౌకర్యాలతో గదులు నిండి ఉన్నాయి. అందరూ అక్కడికే వస్తున్నారు. పని పెరగడంతో రంగారావుకు తల ఎత్తడానికికూడా తీరిక కలగడం లేదు.

ఒకనాటి సాయంత్రం కొంచెం తీరిక కలిగిన తరవాత గార్డెన్‌లో కుర్చీవేసుకొని కూర్చున్నాడు రంగారావు. యింతలో గేటు తెరుచుకు వస్తున్న యిద్దరు యువతీ యువకులు అతనిదృష్టినాకర్షించారు. అతను ఆశ్చర్యంతో చూశాడు. సందేహంలేదు. ఆమె మణి! మరి ఆ యువకుడెవరు?

వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ మధ్యమధ్య నవ్వుతూ-తనకేసి చూడనైనా చూడకుండా-తన లాడ్జింగ్ హెూమ్‌లోకే వెళ్ళిపోయారు. తను హృదయపూర్వకంగా ప్రేమించిన సుంద రిని ఎత్తుకుపోతున్న ఆ కీచకు డెవరో ఎంత ఆలోచించినా రంగారావుకు బోధపడలేదు. ఈ ఘోరమైన సస్పెన్సునుంచి బయటపడా లంటే సస్పెన్సురావును రంగంలో ప్రవేశపెట్టి తీరాలి.

వెంటనే రంగారావు సస్పెన్సురావుకు కబురు చేశాడు. అయిదు నిముషాలలో అన్ని పరిక రాలతోనూ సస్పెన్సురావు హాజరయ్యాడు. రంగారావు అతనికి విషయం తెలియజేశాడు. సస్పెన్సురావు మౌనంగా అంతా విన్నాడు. వెంటనే డిటెక్టివ్ పోజులో ముందుకు నడి చాడు. అతని వెనుక దిగులుముఖంతో రంగా రావు నడిచాడు. ఇద్దరూకలిసి ఓ గదిముందుకు వచ్చి ఆగిపోయారు.

గదిలోని యువతీ యువకు లిద్దరూ చెరో కుర్చీలో కూర్చుని బాహ్య ప్రపంచాన్ని మరచి ఏవో మాట్లాడుకుంటున్నారు. సస్పెన్సురావు పరిశీలించి చూశాడు. యువకుడు పుష్టిగా వున్నాడు. ముఖంలో క్రూరస్వభావం కని పించడం లేదు. ఎత్తు ఐదు అడుగుల ఆరు అంగుళాలు. మణి మునుపటిలా లేదు. పచ్చని సిల్కు జాకెట్టు వేసుకొంది. జార్జెట్ చీర కట్టు కొంది. ముఖంలో ఉత్సాహం తొణికిసలాడు తోంది. సస్పెన్సురావు తీవ్రాలోచనతో ముందుకు నడిచాడు. రంగారావు అతనిని అనుసరిం చాడు. యిద్దరూ మేడమీద కూర్చుని చాలా సేపు తీవ్రంగా ఆలోచించారు.

ఆ యువకు డెవరు? వాళ్ళిద్దరికీ పరిచయం ఎలా కలిగింది? లాడ్జింగ్ హెూంలో ఏకాంతంగా చర్చించుకోవలసినంత అవసరం వాళ్ళకేం వచ్చింది?—చీకట్లు ఆవరిస్తున్నాయ్. ఎంత ఆలోచించినా యీ ప్రశ్నలకు జవాబు దొరక లేదు.

"పోనీ! ఆ యువకుడినే నాలుగు ప్రశ్నలడి గితే?" అన్నాడు రంగారావు.

"సరే! అంతకంటే ప్రస్తుతం మనకు గత్యం తరం కనిపించడంలేదు." ఒప్పుకున్నాడు సస్పెన్సురావు.

ఇద్దరూ గది చేరుకున్నారు. ఆశ్చర్యంతో నోరు తెరిచాడు రంగారావు. గది తలుపులు పూర్తిగా తెరిచివున్నాయ్. గదిలో ఎవరూలేరు.

ఇంత ఆకస్మికంగా యీ గదిలోని యువతీ యువకులు ఎలా మాయయ్యారు? వ్యవహారం చూడగా చూడగా సస్పెన్సురావుకు అనుమానం ఎక్కువయ్యింది. యీ చుట్టువట్ల ఎక్కడా హత్య జరగలేదు కదా కొంపతీసి! సస్పెన్సు రావు తొందరగా వీధిలోకి నిష్క్రమించాడు. రంగారావు నిస్పృహతో ఆకాశంకేసి చూశాడు. దేదీప్యమానంగా ప్రకాశించే తార మబ్బుల చాటుకుపోయి మాయమయ్యింది. ★

---

ఒక అజ్ఞాతవ్యక్తి ఒక ప్రాంతానికి వెళ్ళి "యీ ఊరు ఆరోగ్యవంతమైన దేనా?" అని ఒక గ్రామస్థుని ప్రశ్నించాడు.

"ఓ. నేను ఇక్కడకు కొత్తగా వచ్చినప్పుడు ఒక్క మాట కూడా మాట్లాడ లేని స్థితిలో ఉన్నాను. తలమీద జుట్టు కూడా ఉండీ లేనట్టుగా ఉంది. కనీసం నేను లేచి నడవలేకపోయేవాణ్ని. నన్నసలు పక్కమీదినించి లేవదీసి మరొకచోట పడుకోబెట్టవలసి వచ్చేది" అన్నాడు గ్రామస్థుడు.

"తమాషాగా ఉందే! అయితే నీవు ఎంతకాలంనించి ఇక్కడ ఉంటున్నావు?" అన్నాడు ఆ వ్యక్తి.

"పుట్టింది యిక్కడే. పుట్టినప్పుడు అదే స్థితిలోనే కదా ఉన్నాను" అన్నాడు గ్రామస్థుడు.